క్లుప్తంగా

డ్రెయినేజీ నిర్మించాలని వినతి



ధన్వాడ: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మురుగు కాల్వ నిర్మించాలని స్థానికులు అంటున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతోందని, ఇళ్లమధ్య నిలుస్తోందని వాపోతున్నారు. దీంతో దోమల బెడద పెరిగి వ్యాధుల బారిన పడుతున్నామని అంటున్నారు. ఈ మేరకు కాల్వ నిర్మాణం కోసం సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కెంచె కుసుమ, అనురాధ, భారతమ్మ, నసీరా తదితరులు ఉన్నారు.

నేడు ఎల్లమ్మ జాతర

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని సింగార్‌బేస్ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే పళ్ల బురుజు ఎల్లమ్మ ఆలయం, కొండారెడ్డిపల్లి చెరువు వద్ద వెలసిన జములమ్మ, ఎల్లమ్మ జాతర ఉత్సవాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మంతన్‌గోడ్‌లో వైద్యశిబిరం



మక్తల్: మంతన్‌గోడ్ గ్రామంలో ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జడ్పీ చైర్ పర్సన్ వనజ ప్రారంభించారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ కర్త హాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో హైదరాబాద్

నారాయణపేట టౌన్ : గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెంకట్రామిరెడ్డి, కన్వీనర్ బాల్‌రాం పిలుపునిచ్చారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26 వేలు నిర్ణయించి అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలని రాస్తారోకో



మక్తల్: గుడిగండ్ల గ్రామంలో అంతర్‌రాష్ట్ర రహదారిపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని సోమవారం గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ఎవరు పట్టించుకోవడం లేదని అన్నారు. వాహనాలు అతివేగంగా వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మక్తల్ ఎస్‌ఐ పర్వతాలు అక్కడికి చేరుకుని గ్రామస్తులకు సర్దిచెప్పడంతో శాంతించారు.

సీనియర్ అసిస్టెంట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

నారాయణపేట టౌన్ : దామరగిద్ద మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ వెంకటరాములుపై చర్య తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయశ్రీ హర్షకు సోమవారం ఖాసి వ్యక్తి ఫిర్యాదు చేశారు. నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామానికి చెందిన తనకు, వెంకట్రాములు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా ఓ ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారని, అయితే అదే ప్లాట్‌ను వేరొక వ్యక్తి కొనుగోలు చేశారని అన్నారు. ప్లాట్ తన దేనని వెంకట్రాములు డబ్బులు తీసుకొని మోసం చేశాడని పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఎన్నికల ప్రచారం

కోస్గి: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం నూతన మండల పరిధిలోని హకీంపేట, సర్దఖాన్‌పేట్, మీర్జాపూర్, ముశ్రీఫా, గుండుమాల్, బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాల, నాచారం కేజీబీవీలో ప్రచారం నిర్వహించారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, మండల అధ్యక్ష, కార్యదర్శులు అంజిలయ్య, వెంకటేష్‌తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేధిస్తున్న వైద్యుల కొరత



ధన్వాడ ప్రభుత్వ ఆస్పత్రి

- ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు
- 60 వేల మంది జనాభాకు ఒక్క ఎంబీబీఎస్ డాక్టర్ కూడా లేని వైనం

ధన్వాడ: మండలంలో ప్రభుత్వ వైద్యుల కొరత వేధిస్తోంది. దాదాపు 60 వేల మంది జనాభా ఉన్న ధన్వాడ మండలంలో కనీసం చూద్దామంటే కూడా ఒక్క ఎంబీబీఎస్ డాక్టర్ కనిపించదు. దీంతో గ్రామాలలోని నిరుపేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి అప్పుల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలో వాస్తవానికి ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్‌లు ఉండాల్సిన అవసరం ఉంది. కానీ సబ్‌సెంటర్‌లకు కేటాయించిన బీహెచ్‌యంఎస్(యునాని) డాక్టర్‌తో కొనసాగిస్తున్నారు. దీంతో సబ్‌సెంటర్‌లో వైద్యం అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ధన్వాడ మండలంలో మొత్తం 5 సబ్‌సెంటర్‌లు ఉన్నాయి. కిష్టాపూర్, కొండాపూర్, మందిపల్లి, చర్లపల్లి, ధన్వాడలలో ఉన్న వీటికి గతంలో 5 మంది వైద్యులను కేటాయించారు. కాగా వారిలో ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఇందులోనూ కొండాపూర్‌కు కేటాయించిన డాక్టర్‌ను కోటకొండ ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో మండలం మొత్తం ఇద్దరే అదికూడా బీహెచ్‌యంఎస్(యూనాని) వైద్యులు ఉన్నారు. వారిలో చర్లపల్లి డాక్టర్‌ను కంటివెలుగుకు కేటాయించారు. కిష్టాపూర్ డాక్టర్‌ను ధన్వాడ ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జ్‌గా నియమించారు. ధన్వాడలో ఇదివరకు విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకట్‌దాదాన్‌ను మహబూబ్‌నగర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. దీంతో అప్పటినుంచి వైద్యసేవలు అందడం లేదు. బీహెచ్‌యంఎస్ డాక్టర్ ఉండడంతో ప్రజలు ఇక్కడికి రావడానికి జంకుతున్నారు. ఇప్పటికైనా ఎంబీబీఎస్ డాక్టర్లను నియమించి సమస్యలు పరిష్కరించాలని మండల ప్రజల కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మండల ప్రజలను వైద్యుల కొరత వేధిస్తోంది. ఒక్క ఎంబీబీఎస్ వైద్యుడు కూడా లేకపోవడంతో ఆస్పత్రులకు వచ్చే రోగులు అవస్థలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితులలో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యులను నియమించి సమస్యను పరిష్కరించాలి.

– నాగరాజు, ధన్వాడ

వైద్యులను నియమించాలి



మండలంలో ఒక్క ఎంబీబీఎస్ డాక్టర్ కూడా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. వైద్యులు లేక ప్రజలు జిల్లాకేంద్రానికి లేదా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి వైద్యులను నియమించాలి.

–గోవర్ధన్‌గౌడ్, ఎంపీటీసీ, ధన్వాడ

మెడికో ప్రీతి కుటుంబాన్ని ఆదుకోవాలి



మక్తల్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మద్దూరు: ర్యాగింగ్ భూతానికి బలైన ప్రీతి నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఆమె మరణానికి కారణమైన యండీ. సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని గిరిజన నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయక్ ప్రీతి నాయక్ కుటుంబానికి రూ.కోటి రుపాయాలు, ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: ర్యాగింగ్ భూతానికి బలైన ప్రీతి నాయక్‌కు సోమవారం మక్తల్ పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. నాయకులు వినయ్, వంశీ, శరన్, సురేష్, నితిన్, భాస్కర్ పాల్గొన్నారు.

డీఐఈఓకు కాంట్రాక్ట్ లెక్చరర్ల వినతి

నారాయణపేట రూరల్ : జిల్లా ఇంటర్ నోడల్ అధికారి రియాజ్ హుస్సేన్‌కు సోమవారం కాంట్రాక్ట్ లెక్చరర్లు వినతిపత్రం అందించారు. వచ్చే నెలలో జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల్లో తమకు సరియైన విధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నో సంవత్సరాలుగా జిల్లాలో పని చేస్తున్నందున అనుభవం ప్రకారం పబ్లిక్ పరీక్షల సీఎస్, డీఓలుగా విధులు కేటాయించాలని, మాడల్ స్కూల్‌ల కంటే ఎక్కువగా ప్రభుత్వ కళాశాలలోనే పనిచేసే లెక్చరర్ల సంఖ్య అధికంగా ఉందన్నారు. ఆ నిష్పత్తిలోనే అవకాశాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా సంఘం నాయకులకు స్కాడ్ డ్యూటీలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.వెంకట్రాములు, నాయకులు పరుశరములు, రజాక్ సిద్ధిఖి, కృష్ణ, రాములు, శోభారాణి పాల్గొన్నారు.



డీఐఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ట్రాకర్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న సూపర్ వైజర్ రాజ్యలక్ష్మి

కోస్గి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పారదర్శకమైన సేవల కోసం ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న పోషణ్ ట్రాకర్ యాప్‌లో చిన్నారులు, గర్భిణులు, కిషోర బాలికల వివరాలు విధిగా నమోదు చేయాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజ్యలక్ష్మి సూచించారు. ఈ మేరకు సోమవారం కొత్త మండలం గుండుమాల్ మండల కేంద్రంలో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు ట్రాకర్ యాప్‌పై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ ఉదయం కేంద్రం ప్రారంభం కాగానే విద్యార్థుల హాజరు వివరాలు, ప్రతి నెల 5వ తేదీన చిన్నారుల బరువు నమోదు చేయాలన్నారు. ప్రతినెల విధిగా సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం..

అమరచింత: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రామాలను స్వచ్ఛంగా మార్చుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఎంపీపీ మాలతి కోరారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సంఘాల లీడర్లు, బుక్ కీపర్లకు స్వచ్ఛ పక్వాడ్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మూడు రోజుల పాటు ఇచ్చే శిక్షణ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దుకునేందుకు తీసుకోవాల్సిన కార్యక్రమాలను తెలుసుకుని వాటిని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు వీడియో క్లిప్పింగ్ ద్వారా అవగాహన కల్పించారు. గ్రామంలో పచ్చదనం తీసుకొని రావాలన్నారు. ప్రతిఒక్కరూ బహిర్భూమికి వెళ్లకుండా మరుగుదొడ్డిని వినియోగించుకునే అలవాటును తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్క సరోజ, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, ఆర్‌పిలు రమేష్, కుర్మయ్య, పరీద్, రాజు, సత్యన్న, రఘుతో పాటు ఎంపీఓ నరసింహులు, ఏపీఓ బాలయ్య పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ



కోస్గి: జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు కర్నె శ్రీశైలం జయంతిని సోమవారం ఆసంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ మతం మారిన దళితులకు ఎస్సీ ధ్రువీకరణ రద్దు చేయాలని, హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్న సంస్థలను నియంత్రించాలని ఉమ్మడి రాష్ట్రంలో జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి స్థాపించి ఎనలేని పోరాటం చేశారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. నాయకులు సీబీ వెంకటేష్, పోకల లక్ష్మణ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల అడ్డగింత



మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామ సమీపంలోని పెద్దవాగు నుంచి ప్రభుత్వ అనుమతులతో ఇసుక తరలిస్తున్న టిప్పర్లను రైతులు సోమవారం అడ్డుకున్నారు. కొన్ని నెలలుగా ఈ భారీలోడ్ వాహనాలు తిరుగుతుండటంతో బీటీ రోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా తయారైందని వాపోయారు. నిత్యం టిప్పర్లు తిరుగుతున్న సమయంలో దుమ్ముతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు పాడవుతున్నాయని, వాహనాదారులకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కాంట్రాక్టర్‌ల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపుగా రెండు గంటల పాటు 15 ఇసుక టిప్పర్లను అడ్డుకున్నారు. చివరికి కాంట్రాక్టర్‌లు వచ్చి రోజు మూడుపూటలా నీరు కొడతామని చెప్పడంతో శాంతించారు.

వర్క్‌షాప్‌కు తరలిన కార్మికులు

నారాయణపేట టౌన్ : భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వర్క్ షాప్‌కు జిల్లా నాయకులు తరలివెళ్లారు. నాయకులు తిమ్మప్ప జిల్లాలో సమస్యలు వివరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటంరాజు, రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్‌రావు, పేట జిల్లా నుంచి జిల్లా అధ్యక్షులు బాలరాం, నాయకులు నరసింహా తదితరులు పాల్గొన్నారు.

శక్తి ఫౌండేషన్ సభ్యులకు గవర్నర్ అభినందన

ఊట్కూర్: ఎంతోమందికి రక్తదానం చేయిస్తున్న శక్తి ఫౌండేషన్ సభ్యులను సోమవారం హైదరాబద్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై అభినందించారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో శక్తి ఫౌండేషన్ సభ్యులను పిలిచి ఇప్పటివరకు ఎంతమందికి రక్తదానం చేశారు తదితర వివరాలు అడిగి వారిని అభినందించారు. యువకేంద్రం జిల్లా యువ జన అధికారి కోటా నాయక్, శక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు

మాగనూర్: మండల కేంద్రంలో కొందరు అధికారుల నిర్లక్ష్యంతో రైతుల పంటలు ఎండుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే ఇటీవల నూతనంగా ఏర్పడిన రైల్వే లైన్ కారణంగా స్టేషన్ సమీపంలోని రైతులు పొలాలు రెండుభాగాలుగా విడిపోయాయి. దీంతో పంటల సాగు కోసం అవసరమైన విద్యుత్ సరఫరాకు గతంలో కాంట్రాక్టర్ అండర్ పాస్ విద్యుత్‌లైన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ వరకు భాగానే ఉన్నా అసలు సమస్య ఇప్పుడు మొదలైందని రైతులు వాపోతున్నారు. అండర్ పాస్ విద్యుత్ వైర్లు కాలిపోవడంతో కొన్నిరోజులుగా పంటలకు నీరు అందించలేకపోతున్నామని వాపోయారు. విషయంపై కాంట్రాక్టర్, ఇటు విద్యుత్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంటలు ఎండి నష్టపోతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

మాగనూర్: రాష్ట్రంలో పని చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 1, 2, 3వ తేదీలలో నిర్వహించే సమ్మెకు సహకారం అందించాలని సీఐటీయూ నాయకులు అన్నారు. మాగనూర్ అంగన్‌వాడీ సూపర్ వైజర్ స్వర్ణలతకు సోమవారం వినతి పత్రం అందజేశారు. జిల్లా కో కన్వీనర్ ఆంజనేయులు.. తమిళనాడు, పాండిచ్చేరిలలో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని తెలిపారు. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్, పండుగ బోనస్ సౌకర్యాలు కల్పిస్తున్నారని మన రాష్ట్రంలోనూ అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు ప్రసన్న, కృష్ణవేణి, శివకుమారి, మమత, తులసి, ఆశమ్మ, సునీత, రామలింగమ్మ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సంక్షేమ పథకాల అమలుకు పోరాటం



మాగనూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న బాబు



పేటలో జెండా ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

నారాయణపేట టౌన్ : ఎన్‌పీఆర్‌డీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని సుభాష్‌రోడ్‌లో ఆ సంఘం పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర సదస్సుకు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హక్కులు, చట్టాల సాధనకు పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కాశప్ప, జిల్లా నాయకులు, బాబు, బస్వరాజ్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: దివ్యాంగుల చట్టాలు, సంక్షేమ పథకాలు సరిగా అమలు చేసే వరకు పోరాటాలు చేస్తామని ఎన్‌పీఆర్‌డీ మండల అధ్యక్షుడు పూజనూర్ బాబు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో సంఘం ఏర్పడి 13 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. తమ సంఘం 13 ఏళ్లలో దేశ వ్యాప్తంగా విస్తరించి దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు చేసి విజయాలు సాధించిందని అన్నారు. పెన్షన్ రూ. 10వేలు , ఉచిత విద్యుత్ ప్రయాణ సౌకర్యం, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ, నామినేటెడ్ పదువులలో రిజర్వేషన్ల అమలు, స్వయం ఉపాధి, రుణాలు కోసం ఉద్యమాలు చేస్తామని తెలిపారు. నాయకులు రవి, వెంకటమ్మ, నర్సమ్మ, సలీం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులైన విద్యార్థులు



సంగంబండలో స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మక్తల్: సంగంబండ యూపీఎస్‌లో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్‌గా అశ్విని, డీఈఓ మహేష్, ఎంఈఓగా అఖిల బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా జక్లేర్ గ్రామంలో సోమవారం శాంతినికేతన్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్‌గా అర్చన, డీఈఓగా యశ్వంత్‌రెడ్డి, ఎంఈఓగా భవానీ, హెచ్‌ఎంగా అభినంద్, అనిల్, హరినాథ్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భీంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు పంపిణీ

మాగనూర్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయడంతో ఎన్నో లాభాలు ఉన్నాయని మండల జూనియర్ పశువైద్యాధికారి వినయకుమార్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని వర్కూర్ గ్రామంలో గొర్రెలు, మేకలకు మందులు వేశారు. పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది యశోద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మందులు వేస్తున్న సిబ్బంది

కృష్ణా మండలంలో నేటినుంచి

కృష్ణా: మండలంలో నేటి నుంచి నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తామని, సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ జీవులకు నట్టల నివారణ మందులను తప్పని సరిగా వేయించాలన్నారు. మంగళవారం ముడుమాల్, మురహర్‌దొడ్డి, మార్చి1న గుడెబల్లూర్, 2న ఆలంపల్లి, 3న హిందుపూర్, కృష్ణా, 5న తంగిడి, 6న అయినాపూర్, కున్సి, గుర్జాల్ గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు.

అల్పాహారంలోనూ అవినీతి!

మాగనూర్: ప్రభుత్వం పదో తరగతి విద్యార్థుల కోసం పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో వారికి అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఎక్కువ శాతం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తరగతులకు ఏమీ తినకుండా వస్తుంటారన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు తీసుకుంది. ప్రతిరోజు అల్పాహారం పెట్టడం కోసం ఒక్కో విద్యార్థికి రూ. 15 ఖర్చు చేస్తుంది. కానీ మండలంలోని కొన్ని పాఠశాలల్లో సక్రమంగా అమలు కావడం లేదు. కొందరు కక్కుర్తితో అందులోని డబ్బులను నొక్కేస్తున్నారని, కనీసం రూ.5 కూడా విలువ చేయని నాసిరకం ఆహార పదార్థాలను అందిస్తున్నారని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీంతో తినలేక పస్తులుంటున్నామని, మధ్యాహ్న భోజన సమయం వరకు ఆకలితోనే తరగతులు వింటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా (కస్తూర్బా కాకుండా) మొత్తం 213 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న శాంతకుమార్

మద్దూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్తపై ఉందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లేనిపోనీ ఆరోపణలు చేస్తుందన్నారు. పేదలకు ఉచిత బియ్యం, అందరికి కరోనా టీకా అందించింది కేంద్ర ప్రభుత్వమని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మదన్, మండల అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి సాయిలు,నాయకులు రఘు, భరత్, కాశీ తదితరులు పాల్గొన్నారు.